

భూముల ఆక్రమణపై కన్నెర్ర

రైతులు సాగు చేసుకుంటున్న భూములకు ఓఆర్‌సీ పత్రాలు సృష్టించి, బ్లూ షీట్ కంచె వేయడంతో రైతులు ఆగ్రహించారు. 8లో▸



జేపీదర్గా ఆవరణలో ఉద్రిక్తత

తమ దుకాణాలను అన్యాయంగా తొలగించినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని జేపీదర్గా ఆవరణలో బాధితులు ఆందోళన చేశారు. 8లో▸

నేటి 'ఎగ్జిబిషన్'.. లేడీస్ స్పెషల్

అబిడ్స్: నుమాయిష్‌లో మంగళవారం మహిళలకు మాత్రమే అనుమతిస్తామని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్విని మార్గం తెలిపారు. ప్రతిసారిలానే ఈ ఏడాది కూడా లేడీస్ డే రోజు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలచే సాంస్కృతిక కార్యక్రమాలు, పలు విభాగాల్లో ఆటల పోటీలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు మహిళలను మాత్రమే అనుమతించి వేడుకలు నిర్వహిస్తామన్నారు.

న్యూస్‌రీల్

పిల్లలను పనిలో పెట్టొద్దు

జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి కృష్ణయ్య



బడి బయటి పిల్లల సర్వేను పర్యవేక్షిస్తున్న కృష్ణయ్య

ఇబ్రహీంపట్నం: తమ పిల్లలను తల్లిదండ్రులు తప్పక పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి కృష్ణయ్య కోరారు. ఇబ్రహీంపట్నంలో సోమవారం బడి బయటి పిల్లల సర్వే నిర్వహించారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి వెంకటేశ్, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి ఉషారాణితో కలిసి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారిని పనుల్లో పెట్టొద్దని, మంచి భవిష్యత్తు అందించే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించి శిక్షణ ఇవ్వడంలో శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు రఘురంజన్, అశోక్, ఐఈఆర్పీ రవి పాల్గొన్నారు.

ఆ స్టోన్ క్రషర్‌కు విద్యుత్ సరఫరా నిలిపేయండి

కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు

అబ్దుల్లాపూర్‌మెట్: వాయుకాలుష్యంతో పాటు అధికంగా దుమ్ము వదులుతున్న స్టోన్ క్రషర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయాలంటూ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు అధికారులు విద్యుత్‌శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వివరాలివీ.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట రెవెన్యూ సర్వే నంబర్‌లోని 222లో కొనసాగుతున్న సాయి రోహిత్ మెటల్ ఇండస్ట్రీస్ స్టోన్ క్రషర్ నుంచి దుమ్ము, ధూళి విపరీతంగా వస్తుండడంతో కాలుష్యం ఏర్పడుతోందని పరిసర రైతులు పీసీబీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పరిసరాలను పరిశీలించిన తర్వాత సదరు స్టోన్ క్రషర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఆర్టీసీ సేవలు అమోఘం

మాదాపూర్: సామాన్య ప్రజలతో పాటు ఐటీ ఉద్యోగులకు సేవలు అందిస్తున్నామని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్ సిటీలో సోమవారం టీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏసీ మినీ బస్సులను ఎండీ సజ్జనార్, స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. సైబర్ లైనర్ పేరుతో ప్రారంభించిన ఈ బస్సులు ఐటీ కారిడార్‌లో తిరుగుతాయని తెలిపారు. వీటిలో వైఫై సేవలు, ట్రాకింగ్ సిస్టం అందుబాటులో ఉంటాయన్నారు. ఐటీ ఉద్యోగులు ఒక్కరే ఒక కారులో రావడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని చెప్పారు. ఐటీ కంపెనీల్లో పని చేసే వారు మెట్రోలో వచ్చి సైబర్ లైనర్ బస్సులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే నష్టాల్లోంచి బయటపడుతోందన్నారు. ఐటీ ఉద్యోగులకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతోనే సైబర్ లైనర్ బస్సులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్, హమీద్ పటేల్, కృష్ణయాదుల పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహ టవర్స్ ప్రీ బిడ్‌కు విశేష స్పందన

సాక్షి, సిటీబ్యూరో: పోచారం, గాజుల రామారంలలోని రాజీవ్ స్వగృహ టవర్స్‌కు సోమవారం హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశానికి విశేష స్పందన లభించింది. బిల్డర్లు, డెవలపర్లు, పలు ఉద్యోగ సంఘాలకు చెందిన ప్రతినిధులు సుమారు 50 మందికి పైగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హెచ్‌ఎండీఏ ఎస్టేట్ అధికారి గంగాధర్, చీఫ్ ప్లానింగ్ అధికారి గంగాధర్, ప్లానింగ్ అధికారి ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. పోచారంలో 9 అంతస్తుల టవర్లు నాలుగు ఉన్నాయి. వాటిలో ఒక్కో టవర్‌లో 72 నుంచి 198 ఫ్లాట్‌లను నిర్మించుకొనే సదుపాయం ఉంది. గాజుల రామారంలో 14 అంతస్తుల టవర్లు ఐదు ఉన్నాయి. ఒక్కో టవర్‌లో 112 ఫ్లాట్‌లను నిర్మించుకోవచ్చు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న ఈ రెండు ప్రాంతాల్లో మధ్యతరగతి వర్గాలు ఎంతో ఆసక్తి చూపుతున్నాయి. ఉద్యోగ సంఘాలు ఈ టవర్‌లను కొనుగోలు చేసి ఫ్లాట్‌లను నిర్మించుకొని తమ ఉద్యోగులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ మేరకు వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొని తమ సందేహాలను అధికారుల దృష్టికి తెచ్చారు. సింగిల్ టైమ్ రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని, జీఎస్టీ భారం లేకుండా చూడాలని కోరారు. ఉద్యోగ సంఘాల ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



11.35: తెరుచుకోని కలెక్టర్ అమయ్‌కుమార్ చాంబర్



11.40 : అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ చాంబర్‌లో ఖాళీగా కుర్చీలు



11.45 : డీఈఓ ఆఫీసులో..

సారు.. లేరు!

- కలెక్టరేట్‌లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.15 వరకు 'సాక్షి' విజిట్
- 90 శాతం ఖాళీగా దర్శనమిచ్చిన జిల్లా స్థాయి అధికారుల కుర్చీలు
- ఆశతో వచ్చి.. నిరాశతో వెనుదిరిగిన బాధితులు
- ప్రజలకు దూరంగా కార్యాలయాలు.. తప్పని ప్రయాణ తిప్పలు

సాక్షి విజిట్



11.30: ప్రజావాణిలో అర్జీలు సమర్పించేందుకు వచ్చి అధికారులు లేక ఎదురుచూస్తున్న ప్రజలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు కార్యాలయాలకు రాకుండా సొంత పనుల్లో మునిగిపోతున్నారు. జిల్లా స్థాయి అధికారులే తరచూ విధులకు డుమ్మా కొడుతుండడంతో రికార్డులు, ఇతర సెక్షన్లలోని సిబ్బంది సైతం అదే పంథా అనుసరిస్తున్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగైనా ఉదయం 10 గంటలకే ఆఫీసుకు చేరుకోవాలి. ట్రాఫిక్ నేపథ్యంలో అరగంట మినహాయింపు ఉంటుంది. కానీ కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి అధికారులు మొదలు.. ఆయా సెక్షన్లలోని సిబ్బంది వరకు చాలామంది రోజుల తరబడి విధులకు హాజరు కావడం లేదు. వచ్చిన వారు సైతం క్షేత్రస్థాయి పర్యటనలు, ఉన్నతాధికారులతో సమీక్షలు అంటూ మొఖం చాటేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల్లో 'సాక్షి' బృందం విజిట్ చేసింది.

ఆశతో వచ్చి.. పడిగాపులు పడి

ఉదయం 11.30 గంటలకు ప్రజావాణి సమావేశ మందిరానికి వెళ్లి చూడగా అప్పటికే అక్కడ సుమారు వంద మందికిపైగా బాధితులు ఉన్నారు. వారి నుంచి అర్జీలు స్వీకరించే వారు లేకపోవడంతో నిరీక్షణ తప్పలేదు. సుదూర ప్రాంతాలకు చెందిన వారు ఉదయం పది గంటలకే చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు పడిగాపులు తప్పలేదు. తాగేందుకు నీరు లేక, తినేందుకు భోజనం లేక వారంతా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆ తర్వాత అదనపు కలెక్టర్ తిరుపతిరావు, డీఆర్‌ఓ హరిప్రియ, మరి కొద్ది మంది అధికారులతో హాజరై అర్జీలు స్వీకరించారు. అర్జీలు పెట్టుకునే వారే కాకుండా వివిధ ఫైళ్లపై ఉన్నతాధికారుల సంతకాల కోసం వచ్చిన వారు, చేసిన కాంట్రాక్ట్ పనులకు సంబంధించి బిల్లులు, వాటి తాలూకు ఫైల్ మూవ్‌మెంట్‌ను ఆరా తీసేందుకు వచ్చిన వారు సైతం నిరీక్షించడం కనిపించింది. ఆశతో వచ్చిన వారంతా నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.

ఎటు చూసినా ఖాళీ..

కలెక్టర్ అమయ్‌కుమార్, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ చాంబర్లను పరిశీలించగా సీట్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. అనంతరం ఎల్పీ స్పెషల్ కలెక్టర్, హెచ్ సెక్షన్, ఆడిట్, ఫుడ్ సేఫ్టీ ఆఫీస్, డీఈఓ, వయోజన విద్య, జిల్లా ఖజానాధికారి, ఎస్సీ కార్పొరేషన్, మైనింగ్‌శాఖ, డీటీసీపీఓ, మైనార్టీ సంక్షేమం, జిల్లా పరిశ్రమలు, జిల్లా మత్స్యశాఖ, హౌసింగ్, మెప్మా, బీసీ, ఎస్సీ సంక్షేమశాఖలు, సివిల్ సప్లయ్, డీఆర్‌డీఏ, పంచాయతీ అధికారి, జిల్లా ఇన్‌ఫర్మేటిక్ ఆఫీసర్, టీఎస్ స్వాన్ కలెక్టర్ పేషీలను మధ్యాహ్నం 1.15 గంటల వరకు విజిట్ చేసింది. ఈ సమయంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఓంప్రకాష్, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి మోతి, ఎస్టీ సంక్షేమశాఖాధికారి, జిల్లా సర్వేయర్ మినహా ఇతర అధికారులెవరూ కనిపించలేదు. ఆయా సెక్షన్లలోని సిబ్బంది కుర్చీలు సగానికిపైగా ఖాళీగా దర్శనమిచ్చాయి. కొంతమంది సెలవులో ఉన్నట్లు చెప్పగా.. మరికొంత మంది ఉన్నతాధికారుల సమీక్ష సమావేశాలు, ఫీల్డ్ విజిట్‌కు వెళ్లినట్లు చెప్పడం గమనార్హం.

గోడు ఎవరికి చెప్పాలి?



రెండేళ్ల క్రితం నా భర్త కోవిడ్‌తో చనిపోయాడు. కోవిడ్ మృతులకు కేంద్రం ప్రకటించిన ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటికీ రాలేదు. కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చా. బస్సు సౌకర్యం లేకపోవడంతో మా చెల్లె కొడుకు సాయంతో బైక్‌పై ఉదయం 8.30 గంటలకు లోయపల్లి నుంచి బయలుదేరి 11.30 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్నా. సుమారు 56 కిలోమీటర్లు ప్రయాణించి వచ్చాను. తీరా చూస్తే కలెక్టర్ రాలేదు. ఇప్పుడు నా గోడును ఎ వరికి చెప్పాలి. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేవు. ఆకలేస్తోంది.. తిందామన్నా ఏమీ దొరకడం లేదు.

– జి.పద్మమ్మ, లోయపల్లి

పదిసార్లు వచ్చినా పనికాలే..



మాది యాచారం మండలం మేడిపల్లి సమీపంలోని సరికొండతండా. నాకు రెండున్నర ఎకరాల భూమి ఉండగా, రెండెకరాలు ఫార్మాసిటీ కోసం తీసుకున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు టీఎస్‌ఐఐసీ తీసుకుంది. మిగిలిన భూమి నా పేరుపై ఎక్కించాలంటే ఒరిజినల్ పాస్ బుక్ కావాలంటున్నారు. టీఎస్‌ఐఐసీ వాళ్లు ఇవ్వడం లేదు. కలెక్టర్‌ను కలవాల్సిందిగా సూచించారు. ఇప్పటికి పదిసార్లు ఇక్కడికి వచ్చా పని కాలేదు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. తండా నుంచి రావాలంటే సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. బస్సులు లేక ఆటో తీసుకుని రావాల్సి వస్తోంది. రాకపోకలకు ఖర్చులే అధికమవుతున్నాయి.

– భానునాయక్, సరికొండతండా



11.50 : జిల్లా పరిశ్రమల విభాగంలో ఖాళీగా చాంబర్స్



12.00: బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో..



12.15: తెరుచుకోని డీఆర్‌డీఏ పీడీ ఆఫీసు గది తలుపులు



12.45: కలెక్టర్ పేషీలో బాధితుల నిరీక్షణ

సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి



బూర్గులలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులతో చెన్నకేశవరెడ్డి

షాద్‌నగర్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తానని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్, బూర్గుల, వెల్జర్ల, కమ్మదనం, కొందుర్గు, షాద్‌నగర్ పట్టణంలోని ఉర్దూ మీడియం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఫరూఖ్‌నగర్ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ఎన్నో సమస్యలను పీఆర్‌టీయూ పరిష్కరించిందని గుర్తు చేశారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సురేష్ సింగ్, సురేష్, యాదయ్య, శ్రీనివాస్, ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రావు, రాధికమ్మ, అరుణ, అరుంధతి, లక్ష్మయ్య, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రాంకిషన్, శ్రీధర్‌రెడ్డి, హరిప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, వేణుమాధవ్ రెడ్డి, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మార్కెట్ తరలించొద్దు



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పండ్లతోటల రైతులు

- బాటసింగారం అనుకూలంగానే ఉంది
- ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి రైతుల విన్నపం

ఇబ్రహీంపట్నం: బాటసింగారం నుంచి పండ్ల మార్కెట్‌ను తరలించొద్దని సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పండ్ల తోటల రైతులు కలిసి విన్నవించారు. గతంలో గడ్డిఅన్నారంలో ఉన్న పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించారని, అక్కడి నుంచి బాటసింగారానికి మార్చారని తెలిపారు. విజయవాడ–హైదరాబాద్ ప్రధాన రహదారిలో బాటసింగారానికి తరలించిన ఈ మార్కెట్ రైతులందరికీ అనువుగానే ఉందని.. అలాంటప్పుడు తరలించాల్సిన అవసరం లేదన్నారు. కొంతమంది వ్యాపారులు వారి స్వలాభం కోసం మామిడిపల్లికి పండ్ల మార్కెట్‌ను తరలించాలని ప్రయత్నిస్తున్నారని.. ఈ ప్రయత్నాన్ని నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. విషయాన్ని మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాటసింగారంలోనే పండ్ల మార్కెట్ కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరారు.

'అగ్ని' బరాటాలు!

- మొదటి బ్యాచ్ అగ్నివీర్‌ల శిక్షణ ప్రారంభం
- రెండు భాగాలుగా 31 వారాల పాటు ట్రెయినింగ్
- అత్యాధునిక సిమ్యులేటర్లు సైతం వినియోగం



సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన, గతేడాది అత్యంత వివాదాస్పదంగా మారిన అగ్నిపథ్ పథకం అమలులోకి వచ్చింది. మొదటి బ్యాచ్‌లో మొత్తం 40 వేల మంది అగ్నివీర్‌లుగా ఎంపిక కాగా.. వీరిలో 5,600 మందికి నగరంలోని గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 2 నుంచి మొదటి బ్యాచ్ మొదలైంది. ఈ నేపథ్యంలో ట్రెనింగ్‌లోని విశేషాలను వివరించేందుకు ఆర్మీ అధికారులు సోమవారం మీడియా టూర్ నిర్వహించారు. దేశంలోనే అతి పెద్దదైన గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో జరుగుతున్న అగ్నివీర్‌ల శిక్షణ తీరుతెన్నులు ఇలా..

స్క్వాడ్స్‌గా విభజించి..

ఇప్పటికే 2,265 మంది అగ్నివీర్‌లకు శిక్షణ మొదలైంది. వీళ్లని రీజియన్, బ్యాటరీ, ట్రూప్, స్క్వాడ్స్‌గా విభజించారు. ఒక్కో స్క్వాడ్‌లో గరిష్టంగా 32 మంది అభ్యర్థులు ఉంటారు. వీరికి ఫిజికల్, వెపన్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ సహా అనేక అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఫిజికల్ ట్రెనింగ్ కోసం ఆర్టిలరీ సెంటర్‌లో మొత్తం 30 గ్రౌండ్స్ ఉన్నట్లు చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కల్నల్ షలీన్ సింగ్ తెలిపారు. ఇందులో స్క్వాడ్ల వారీగా రోప్, బార్స్, బీమ్స్ తదితరాలతో శిక్షణ ఇచ్చి అప్పర్ బాడీ పటిష్టమయ్యేలా చేస్తారు.

ముందు బేసిక్ ఆపై అడ్వాన్స్...

మొత్తం 31 వారాల పాటు సాగే శిక్షణను బేసిక్, అడ్వాన్స్‌గా విభజించారు. బేసిక్‌లో ప్రతి అంశానికీ సంబంధించి ప్రాథమిక అంశాలు బోధిస్తారు. డ్రిల్, వెపన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, రాజ్యాంగం, మానవహక్కులు తదితరాలను అవగాహన కల్పిస్తారు. పది వారాల పాటు సాగే ఈ శిక్షణలో అభ్యర్థుల ప్రతిభ, ఆసక్తి బట్టి ఆయా రంగాల్లో అడ్వాన్స్‌డ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో టెక్నికల్ అసిస్టెన్స్, గన్నర్స్, డ్రైవర్స్ ఇలా వివిధ విభాగాలు ఉంటాయి. ఫిజికల్ ట్రెనింగ్ మాత్రం ఆద్యంతం కొనసాగుతుంది. ప్రతి అగ్నివీర్‌కు ఆంగ్ల, హిందీ భాషలతో పాటు మాట, నడక, నడత, వేషధారణ తదితరాలను బోధిస్తున్నారు. ఉదయం 4 గంటలకు నిద్రలేచే అగ్నివీర్ 6 గంటలకు గ్రౌండ్‌కు వస్తారు. 7.30 గంటల వరకు ఫిజికల్ ట్రెనింగ్, అప్పటి నుంచి 8.45 గంటల వరకు డ్రిల్ లేదా వెపన్స్ ట్రెనింగ్, 8.45 నుంచి 1.30 వరకు థియరీ క్లాసులు ఉంటాయి. రెండో విడత మధ్యాహ్నం 4 గంటలకు గేమ్స్ మొదలవుతాయి. 5.20 తర్వాత అభ్యర్థులక ఫ్రీ టైమ్ కాగా... 9 గంటలకు నిద్రకు ఉపక్రమించాల్సిందే.

అత్యాధునిక సిమ్యులేటర్స్ వినియోగం..

బేసిక్ ట్రెనింగ్‌లో వెపన్స్ శిక్షణను ఇబ్రహీంబాగ్ లాంగ్ రేంజ్‌లో ఇన్సాస్ రైఫిల్‌తో ఇస్తారు. అడ్వాన్స్‌డ్ శిక్షణలో మాత్రం ఆర్టిలరీగన్స్‌పై ఉంటుంది. అగ్నివీర్‌ల శిక్షణ కోసం అత్యాధునిక సిమ్యులేటర్స్ వాడుతున్నారు. 'లివింగ్ ఎ లైఫ్ లెస్ ఆర్డినరీ ఐయామ్ ఎ అగ్నివీర్' అనేది అగ్నివీర్ నినాదం కాగా.. 'వన్ షాట్ ఇన్ ఎనిమీ' అన్నది వెపన్స్ ట్రెనింగ్‌కు సంబంధించింది. యుద్ధంలోనే కాదు శిక్షణలోనూ తూటాలు నష్టపోకుండా తొలి దశలో సిమ్యులేటర్‌పై శిక్షణ ఇస్తున్నారు. రేడియో ద్వారా సమాచార మార్పిడి, యుద్ధ, అత్యవసరమ సమయాల్లో మెడికల్ కేర్, రూమ్ ఇంటర్వెన్షన్, శాండ్ మోడల్.. ఇలా అనేక సిమ్యులేటర్లతో శిక్షణ పొందుతున్నారు. శిక్షణ పొందున్న వారికి అగ్నివీర్ ఇంటి పేరుగా మారిపోతోంది. తమను పరిచయం చేసుకునే ప్పుడు 'అగ్నివీర్ రాకేష్ కుమార్', 'అగ్నివీర్ అజాజ్ అహ్మద్', 'అగ్నివీర్ హమన్‌సింగ్' అని చెబుతున్నారు.

శిక్షణ ఇక్కడే

- 15 శాతం మందికి గోల్కొండ ఆర్టిలరీలోనే..
- బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్



అగ్నిపథ్ భాగంగా తొలి దశలో 15 శాతం మందికి గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్‌లోనే శిక్షణ ఇస్తున్నట్లు బ్రిగేడియర్ రాజీవ్ చౌహాన్ తెలిపారు. మొదటి బ్యాచ్ అగ్నివీర్‌లకు శిక్షణ మొదలైన నేపథ్యంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. 1900 ఎకరాల్లో విస్తరించి ఉన్న గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ దేశంలోనే అతి పెద్దదని, ఇక్కడ అగ్నివీర్‌లకు అత్యుత్తమ శిక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. మొదటి బ్యాచ్‌లో 2300 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికే 2265 మందికి ప్రారంభమైందని వివరించారు. రెండో దశలో మరో 3300 మందికి మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభంకానుందని రాజీవ్ చౌహాన్ వెల్లడించారు. 31 వారాల పాటు ఉండే అగ్నివీర్ శిక్షణతో 10 వారాల పాటు బేసిక్ ట్రైనింగ్, ఆపై 21 వారాలు అడ్వాన్స్ శిక్షణ ఉంటాయని తెలిపారు. శిక్షణతో పాటు మూడున్నరేళ్ల సర్వీసులో ఆయా అగ్నివీర్‌లు చూపించే ప్రతిభ ఆధారంగా 25 శాతం మంది పూర్తి స్థాయిలో సైన్యంలో కొనసాగుతారని వివరించారు. నాలుగేళ్లు సైన్యంలో ఉండి బయటకు వచ్చే వాళ్లు సైతం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని ఆయన స్పష్టం చేశారు.

విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యత

- ఆహార నియమాలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్ రూరల్: ప్రజలకు వైద్యం, విద్య అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఖాజాఇద్రీస్ అహ్మద్ ఆధ్వర్యంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కంటి వెలుగు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆహార నియమాల మార్పుల వల్లే కంటి సమస్యలు వస్తున్నాయని, ఆహార నియమాలను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. అనంతరం ఆర్డీఓ రాజేశ్వరీ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎం సహాయ నిధి పేదలకు వరం అని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద కంసాన్‌పల్లికి చెందిన భీష్మాచారికి రూ. లక్ష, మల్లారెడ్డికి రూ. 34వేలు, కమ్మదనం గ్రామానికి చెందిన కృష్ణవేణికి రూ. 60వేలు, భీమారం గ్రామానికి చెందిన మమతకు రూ. 32వేలు, శ్వేతకు రూ. 28వేలు, హాజిపల్లికి చెందిన రాజుకు రూ. 20వేలు, రాసుమల్లగూడకు చెందిన భిక్షపతికి రూ. 38వేలు, చౌలపల్లికి చెందిన నర్సమ్మకు రూ. 25,500, కొండన్నగూడకు చెందిన ఎండి.రఫీక్‌కు రూ. 26వేలు, దేవునిపల్లికి చెందిన వైష్ణవికి రూ. 17వేలు మంజూరయ్యాయి. ఇందుకు సబంధించిన చెక్కులను సోమవారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు.

దళితుల సంక్షేమానికి కృషి

దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. దళిత బంధు పథకం కింద ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామానికి చెందిన వెంకటేశ్‌కు ట్రాక్టర్ మంజూరయ్యింది. లబ్ధిదారుడికి ఎమ్మెల్యే ట్రాక్టర్ అందజేశారు.

మత్స్యకారులకు చేయూత

మత్స్యకారులకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. సోమవారం నియోజకవర్గంలోని ఇన్ముల్‌నర్వ, పాపిరెడ్డిగూడ, శ్రీనివాసులగూడ గ్రామాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, వైస్ ఎంపీపీ మౌనిక, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ జయలక్ష్మి, తహసీల్దారు గోపాల్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఏడీ రాజారత్నం, సీడీపీఓ నాగమణి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఏఓ నిషాంత్‌కుమార్ పాల్గొన్నారు.

భూముల ఆక్రమణపై రైతుల కన్నెర్ర

తమ పొలాలు కబ్జా చేశారని ఆగ్రహం

- బౌన్సర్లను కాపలాగా ఉంచారని మండిపాటు
- పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకున్న బౌన్సర్లపై దాడికి యత్నం



భూముల కబ్జాపై తిరగబడుతున్న మహిళా రైతులు



బాధిత రైతుల తరఫున మాట్లాడుతున్న శ్రీరాములు యాదవ్

తుక్కుగూడ: రైతులు సాగు చేసుకుంటున్న భూములకు ఓఆర్‌సీ పత్రాలు సృష్టించి, బ్లూ షీట్ కంచె వేయడంతో అన్నదాతలు ఆగ్రహించారు. మా భూముల్లోకే మమ్మల్ని రానివ్వరా అంటూ కన్నెర్ర చేశారు. రియల్టర్లు కబ్జా చేసిన పొలాల వద్ద కాపలా ఉన్న బౌన్సర్లపై తిరగబడ్డారు. మా భూములకు మీరు ఎందుకు కాపలా కాస్తున్నారని ప్రశ్నించారు. అన్నదాతలను అడ్డుకునేందుకు యత్నించిన బౌన్సర్లపై రైతు కుటుంబాలు దాడికి యత్నించాయి. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. మా భూమిని అన్యాయంగా కబ్జా చేసి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. రాత్రికిరాత్రి మా భూములు కాజేసేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. కొన్నేళ్ల నుంచి సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ సమస్యను సీపీ, కలెక్టర్, మంత్రి దృష్టికి తీసుకెళ్లామని వారు వివరించారు.

రైతుల భూములు కాపాడాలి: అందెల

మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల కొంగుర ఖుర్దు రెవెన్యూలో భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం రావిర్యాల కలెక్టర్ కార్యాలయ రోడ్డులో రియల్టర్లు కబ్జా చేసిన భూమిని బాధిత రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక రైతులు 50 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూమిని రాత్రికిరాత్రి భూమాఫియా కబ్జా చేశారని మండిపడ్డారు. వందల కోట్ల రూపాయల విలువ చేసే 60 ఎకరాల భూమిని కబ్జా చేసి దొంగ ఓఆర్‌సీ పత్రాలు తయారు చేసి వెంచర్‌గా చేస్తున్నారని ఆరోపించారు. రైతులు సొంత పొలంలోకి రాకుండా బ్లూ షీట్ కంచె వేశారని తెలిపారు. వందల మంది బౌన్సర్లను నియమించి రైతులను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మంత్రి కుమారుడు తన బినామీలతో ఈ భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, చైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్లు బోద యాదగిరిరెడ్డి, వై.శివకుమార్, బాకి విలాస్, బాధిత రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- రూ. 9.5 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభం
- లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



కొంగరకలాన్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజలకు మౌలిక సదుపాయలు కల్పించి ఇబ్రహీంపట్నంను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో 2కిలో మీటర్లు, రావిర్యాల విజయ డెయిరీ నుంచి వండర్‌లా వరకు 4కిలో మీటర్లు రూ. 9.5 కోట్లతో కొంగరకలాన్‌లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు అభివృద్ధి వేగవంతంగా సాగుతోందన్నారు. మున్సిపాలిటీలు, మండలాలను సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. ముఖ్యంగా రోడ్లకు మహర్దశ పట్టనున్నట్లు చెప్పారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తిక, కమిషనర్ అమరేందర్‌రెడ్డి, ఏఈ వీరాంజనేయులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వనం శ్రీనివాస్, గొపగల్ల మహేందర్, నీల్ల హరిదాసుగౌడ్, కోల నాగేష్, నారని మౌనిక, కృష్ణరాజు, కోఆప్షన్ సభ్యులు గోపాల్‌గౌడ్, ఆర్‌అండ్‌బీ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఆదిబట్ల మున్సిపల్ అధ్యక్షుడు జంగయ్య, మాజీ అధ్యక్షుడు గోపగల్ల బాబులు, నాయకులు నారాయణ, జెర్కొని రాజు, కాకి రవీందర్, ప్రవీణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం సమస్యలు పట్టని సర్కార్



రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు సతమతమవుతున్నారని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప అన్నారు. ఈ నెల 13, 14న నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 5వ మహాసభల వాల్‌పోస్టర్‌ను సోమవారం పట్టణంలోని ఎంఆర్‌సీ భవనం ఆవరణలో విడుదల చేశారు. కార్యక్రమానికి వెంకటప్ప హాజరై మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాలుగా విద్యారంగం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని అన్నారు. ప్రమోషన్లు లేక ఉపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్రంగా నష్ట పోతున్నారని తెలిపారు. పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్ర స్థాయిలో విద్యారంగం, పాఠశాల విద్య అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 317 జీఓతో ఎంతో మంది ఉపాధ్యాయులు స్థానికతను కోల్పోయి తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని చెప్పారు. సీపీఎస్ విధానంతో భద్రత, భరోసా లేకుండాపోయిందని, ఫలితంగా ఉపాధ్యాయుల భవిష్యత్ అంధకారంగా మారిందన్నారు. రాష్ట్ర మహాసభలలో విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల సాధనకోసం వేదికను ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లిఖార్జునగౌడ, వెంకటయ్య, శివారెడ్డి, నర్సింహులుగౌడ్, శ్యామలాదేవి, అరుణ, సమత, కృష్ణయ్య, సత్యం, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టోర్నీ విజేత స్పోర్ట్స్ అథారిటీ జట్టు



ట్రోఫీ అందుకుంటున్న స్పోర్ట్స్ అథారిటీ జట్టు

కొందుర్గు: మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా సాగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ముగిసింది. ఓపెన్ టు ఆల్ విభాగంలో ఎనిమిది జట్లు పాల్గొనగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, విజయవాడ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్ మ్యాచ్‌లో విజయవాడ జట్టుపై తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జట్టు విజయం సాధించి ప్రథమ బహుమతికి ఎంపికైంది. విజయవాడ జట్టు ద్వితీయ బహుమతి, మంచిర్యాల జట్టు తృతీయ బహుమతికి ఎంపికైంది. విజేత జట్టుకు మహదేవ్‌పూర్ రవీందర్ రెడ్డి రూ. 50వేలు నగదు బహుమతి అందజేశారు. అలాగే మహబూబ్‌నగర్ వాలీబాల్ అసోసియేషన్ తరఫున శాంత కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచిన విజయవాడ జట్టుకు రూ. 25వేలు నగదు బహుమతి అందజేశారు. తృతీయ బహుమతి అందుకున్న మంచిర్యాల జట్టుకు కొందుర్గుకు చెందిన కాడిగళ్ల మహేందర్ రూ. 10 వేల నగదు బహుమతి అందజేశారు. రూరల్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన షాద్‌నగర్ జట్టుకు ఎంపీపీ పోతురాజు జంగయ్య రూ. 15 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులు ఓటమిని గెలుపునకు నాందిగా భావించాలని సూచించారు. క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, వివిధ పార్టీల నాయకులు కృష్ణారెడ్డి, నరేందర్, శ్రీధర్‌రెడ్డి, కావలి యాదయ్య, రామకృష్ణ, శ్రీశైలం పాల్గొన్నారు.

జేపీదర్గా ఆవరణలో ఉద్రిక్తత

- న్యాయం జరగడం లేదని బాధితుల ఆందోళన
- ఒకరు ఆత్మహత్యాయత్నం



పెట్రోలు బాటిళ్లతో ఆందోళన చేస్తున్న బాధితులు



ఆందోళన వద్ద గుమిగూడిన స్థానికులు

కొత్తూరు: తమ దుకాణాలను అన్యాయంగా తొలగించినప్పటికీ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ సోమవారం మండలంలోని జేపీదర్గా ఆవరణలో బాధితులు ఆందోళన చేపట్టారు. పెట్రోలు బాటిళ్లను ఎదుట పెట్టుకుని న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకుంటామని నినాదాలు చేశారు. ఇంతలో టిప్పు అనే బాధితుడు ఒంటిపై పెట్రోలు పోసుకోవడంతో పాటు తాగాడు. వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా బాధితులకు వ్యతిరేకంగా మరోవర్గానికి చెందిన పలువురు దర్గాలో అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లు ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో దర్గా ఆవరణలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం



తల్లి, పిల్లలు (ఫైల్)

శంకర్‌పల్లి: ఓ వివాహిత ఇద్దరి పిల్లలతో అదృశ్యమైన ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కంది మండలం చెర్లగూడ గ్రామానికి చెందిన అత్తెల్లి నరేందర్‌రెడ్డి, తన భార్య అశ్విని, కుమారుడు, కుమార్తెతో కలిసి ఈ నెల 7న శంకర్‌పల్లికి దుస్తులు కొనుగోలు చేసేందుకు వచ్చారు. బట్టలు కొనుగోలు చేసిన అనంతరం వారిని శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యలయంలో ఉండాలని చెప్పి తన సెల్ ఫోన్‌ను రిపేర్ చేయించుకోవడానికి వెళ్లామని తెలిపారు. తిరిగి వెళ్లి చూసే సరికి భార్య, ఇద్దరు పిల్లలు కనిపించలేదన్నారు. అంతటా వెతికినా ఆచూకి తెలియక పోవడంతో సోమవారం శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రంగాపూర్‌లో ఘటన

నందిగామ: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి వాహనం అదుపుతప్పి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని రంగాపూర్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు మండల కేంద్రానికి చెందిన మాన్‌సింగ్(40) సోమవారం తన ద్విచక్ర వాహనంపై రంగాపూర్ వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకువెళ్లి పడిపోయింది. ఈ ప్రమాదంలో మాన్‌సింగ్ కు తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.